TS 24 0026809

నేటి ప్రభాతదర్శిని

మా వార్త రేపటి వెలుగుకు నిదర్శనం

ఎడిటర్ : కనుకుల ఆనంతరెడ్డి

జాతీయ తెలుగు దినపత్రిక

www.netiprabhatadarshini.in 94932 72754

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ | సంపుటి : 01 | సంచిక : 152 | మంగళవారం, జూన్ 23, 2026 | పేజీలు : 02 | వెల రూ. 1.00/-

ARK MEDIA SUBSCRIBE

విలేఖరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ... విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ.. ప్రజల సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలపై ప్రేరణ కలిగించాలి అనుకుంటున్నారా..? బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా..? అయితే రండి... అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..

నేటి ప్రభాతదర్శిని దినపత్రికలో...

నియోజకవర్గ ఇంచార్జ్‌లు మండల రిపోర్టర్‌లు కావలెను..

సంప్ర : 94932 72754

# మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలి





### హాస్టల్, విద్యాలయం ఆవరణ పరిశుభ్రంగా ఉండాలి

### జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

### తంగళ్ళపల్లి లోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల విద్యాలయంలో ఆకస్మిక తనిఖీ

**తంగళ్ళపల్లి, జూన్ -22**

మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. తంగళ్ళపల్లిలోని సిరిసిల్ల తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ బాలికల విద్యాలయంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా డైనింగ్ హాల్ కి వెళ్లి విద్యార్థులు భోజనం చేస్తుండగా వారితో మాట్లాడారు. ఈరోజు ఏ ఏ ఆహార పదార్థాలు వడ్డించారో ఆరా తీశారు. మెనూ చార్ట్ పరిశీలించి.. అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కిచెన్ గోదాంలో బియ్యం, పప్పులు ఇతర ఆహార పదార్థాలను నాణ్యతను పరిశీలించారు. ఎంతమంది విద్యార్థులు వచ్చారో ఆరా తీశారు. అనంతరం వసతి గదులను, టాయిలెట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. విద్యార్థులందరూ తరగతులకు హాజరయ్యేలా చూడాలని సూచించారు. విద్యాలయాల ఆవరణ పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు.





# కరీంనగర్ జిల్లా నుంచి జడ్‌పీహెచ్‌ఎస్ ఓద్యారం ఘనత!

**నేటి ప్రభాతదర్శిని కరీంనగర్ జూన్ 22 :**

SHVR-2025-26 జాతీయ రేటింగ్‌లో రాష్ట్ర స్థాయిలో ఎంపికైన 10 పాఠశాలల్లో ఒకటిగా జడ్‌పీహెచ్‌ఎస్ ఓద్యారం (గంగాధర మండలం) నిలిచింది. ఈ గుర్తింపుతో పాఠశాలకు మెరిట్ సర్టిఫికేట్, రూ.1 లక్ష ప్రోత్సాహక నిధి లభించనున్నాయి. అదేవిధంగా ప్రధానోపాధ్యాయులకు ప్రత్యేక విద్యా అధ్యయన పర్యటన అవకాశం కల్పించనున్నారు. పాఠశాల పరిశుభ్రత, పచ్చదనం, ఆరోగ్యకర వాతావరణం కోసం ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల నిర్వహణ కమిటీ, గ్రామస్థులు చేసిన సమిష్టి కృషికి ఈ గుర్తింపు నిదర్శనం.



# గుడిసెలు లేని నియోజకవర్గంగా ఘనపూర్ (స్టేషన్)ను తీర్చిదిద్దాలి

### పైలట్ ప్రాజెక్టుగా తీసుకొని రాష్టానికి మార్గదర్శకంగా నిలవాలి

### నిజమైన అర్హులను గుర్తించి ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందించాలి

### ఘనపూర్ (స్టేషన్) శాసనసభ్యులు కడియం శ్రీహరి

### ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలి

### అధికారులు నిబద్ధతతో పని చేసి అర్హుల ఎంపికలో పారదర్శకత పాటించాలి

### జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**నేటి ప్రభాతదర్శిని జనగామ జూన్ 22 :**





ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ప్రతి అర్హులైన కుటుంబానికి గృహ సౌకర్యం కల్పించడమే లక్ష్యమని ఘనపూర్ (స్టేషన్) శాసనసభ్యులు కడియం శ్రీహరి పేర్కొన్నారు. సోమవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతి, రెండో విడత లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియపై జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝాతో కలిసి ఘనపూర్ (స్టేషన్) శాసనసభ్యులు కడియం శ్రీహరి ఘనపూర్ (స్టేషన్) నియోజకవర్గానికి చెందిన తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఇంజినీరింగ్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిని క్షుణ్ణంగా సమీక్షిస్తూ, మొదటి విడతలో మంజూరైన 3,500 ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రెండో విడతలో నియోజకవర్గానికి 2,000 ఇళ్లు మంజూరైన నేపథ్యంలో అర్హుల ఎంపికలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. ఏ ఒక్క అర్హులైన కుటుంబం కూడా పథకం ప్రయోజనాల నుంచి దూరం కాకుండా క్షేత్రస్థాయిలో సమగ్ర ధృవీకరణ చేపట్టాలని అన్నారు. ప్రస్తుతం గుడిసెల్లో, పెంకుటింట్లో, రేకుల షెడ్లలో నివసిస్తున్న వారితో పాటు అద్దె ఇళ్లలో జీవనం సాగిస్తున్న పేద కుటుంబాలకు ప్రాధాన్యత కల్పించాలని సూచించారు. ఎంపిక ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా నిజమైన అర్హులను గుర్తించాలన్నారు. అదే విధంగా ప్రభుత్వ భూములు, వివాదాస్పద భూములను గుర్తించి, అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. మార్క్ చేయని ఇళ్లు, మార్క్ చేసినప్పటికీ ఇంకా నిర్మాణాలు ప్రారంభం కాని ఇళ్ల వివరాలను వెంటనే అందజేయాలని అధికారులను ఆదేశించారు. సంచార జాతులకు చెందిన నిరుపేద కుటుంబాలకు ప్రత్యేక ప్రాధాన్యత కల్పించి, గృహ సౌకర్యం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన ధాన్యం కొనుగోలు ప్రక్రియలో అధికారులు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా పని చేసి రాష్ట్రంలో జిల్లాకు మంచి గుర్తింపు తీసుకువచ్చారని ప్రశంసించారు. అదే నిబద్ధత, అంకితభావంతో ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమాన్ని కూడా విజయవంతం చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో పారదర్శకత, జవాబుదారీతనం, వేగం ఉండేలా అధికారులు కృషి చేయాలని, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సమయానికి పూర్తి చేసే దిశగా సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. గుడిసెలు లేని నియోజకవర్గంగా ఘనపూర్ (స్టేషన్)ను తీర్చిదిద్దేందుకు సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని స్పష్టం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో ఘనపూర్ (స్టేషన్) మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈఓ) రంగా రావు, జనగామ, హనుమకొండ గృహ నిర్మాణ శాఖ పీడీలు మాతృ నాయక్, నియోజకవర్గ పరిధిలోని తహసీల్దార్లు, ఎంపీడీఓలు, పంచాయతీరాజ్, ఇంజినీరింగ్ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మమతా బెనర్జీకి షాక్.. చైర్‌పర్సన్‌గా తొలగించిన రెబల్ వర్గం

### టీఎంసీలో మరింత ముదిరిన సంక్షోభం

### చైర్‌పర్సన్ పదవి నుంచి మమతను తొలగించిన రెబల్స్

### కొత్త కమిటీ ఏర్పాటు, అరూప్ రాయ్ నూతన చైర్మన్

### అభిషేక్ బెనర్జీని సస్పెండ్ చేసిన తిరుగుబాటు వర్గం

**పశ్చిమ బెంగాల్, నేటి ప్రభాత దర్శిని**



పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో పెను సంచలనం చోటుచేసుకుంది. తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పార్టీలో సంక్షోభం పతాక స్థాయికి చేరింది. పార్టీ అధినేత్రి మమతా బెనర్జీని చైర్‌పర్సన్ పదవి నుంచి తొలగిస్తున్నట్లు ప్రతిపక్ష నేత, టీఎంసీ రెబల్ నాయకుడు రితబ్రత బెనర్జీ ప్రకటించారు. అసలైన టీఎంసీ తమదేనని ఆయన స్పష్టం చేశారు. కోల్‌కతాలోని న్యూటౌన్‌లో గల ఒక ఫైవ్‌స్టార్ హోటల్‌లో సోమవారం ఈ వర్గం సమావేశమైంది. ఈ సందర్భంగా సీనియర్ ఎమ్మెల్యే అరూప్ రాయ్‌ను కొత్త చైర్‌పర్సన్‌గా వాయిస్ ఓటు ద్వారా ఎన్నుకున్నారు. పార్టీ నిర్వహణ కోసం 30 మంది సభ్యులతో కూడిన ఒక కమిటీని కూడా నియమించారు. ఒకప్పుడు మమతకు అత్యంత సన్నిహితుడైన ఫిర్హాద్ హకీమ్‌తో పాటు అరూప్ బిశ్వాస్, రతిన్ ఘోష్, సబినా యాస్మిన్‌లను వైస్ చైర్‌పర్సన్‌లుగా నియమించారు. రితబ్రత బెనర్జీ, జావేద్ ఖాన్, సందీపన్ సాహాలను ప్రధాన కార్యదర్శులుగా ప్రకటించారు. తమకు 60 మంది ఎమ్మెల్యేలు, 70 మంది మాజీ కౌన్సిలర్ల మద్దతు ఉందని వారు వెల్లడించారు. ఇదే క్రమంలో మమత మేనల్లుడు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీని కూడా ఈ వర్గం పార్టీ నుంచి సస్పెండ్ చేసింది.

# వర్షాకాల ముందస్తు చర్యలు

**బాన్సువాడలో మున్సిపాలిటీ ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్**



**నేటి ప్రభాతదర్శిని బాన్సువాడ ప్రతినిధి.**

రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ ఆదేశాల మేరకు బాన్సువాడ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని 3వ వార్డు, 13వ వార్డుల్లో ఈ డ్రైవ్ చేపట్టారు. మున్సిపల్ సిబ్బంది కాలువలు, డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్త, మట్టిని తొలగించారు. రోడ్ల పక్కన ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలు, మురికిని శుభ్రం చేసి దోమల నివారణ మందు పిచికారీ చేశారు. నీటి నిల్వలు ఏర్పడకుండా డ్రైనేజీలకు అడ్డుగా ఉన్న అడ్డంకులను తొలగించారు. కమిషనర్ గోపు గంగాధర్ మాట్లాడుతూ "వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ముందస్తు పారిశుద్ధ్య చర్యలు చేపట్టాం. ప్రతి వార్డులో డ్రైనేజీలను శుభ్రపరచడం, చెత్తను ఎప్పటికప్పుడు తొలగించడం, దోమల నివారణ చర్యలు కొనసాగిస్తాం. ప్రజలు కూడా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ మున్సిపాలిటీకి సహకరించాలి" అని విజ్ఞప్తి చేశారు. ప్రజలు కూడా తడి చెత్త, పొడి చెత్త వేరుచేసి ఇవ్వాలని, ప్లాస్టిక్ కాలువల్లో వేయవద్దని అధికారులు సూచించారు.ఈ కార్యక్రమంలో హకీమ్ ఖలేఖ్,గౌస్ రోహిత్, తదితరులు పాల్గొన్నారు..

# జిల్లా కలెక్టర్ కు అధికారుల శుభాకాంక్షలు

**జనగణన - 2027 మొదటి దశలో రాష్ట్రంలో జిల్లాకు మొదటి స్థానం**

**మర్యాద పూర్వకంగా కలిసిన డిడోర్స్ అధికారులు**



**నేటి ప్రభాతదర్శిని రాజన్న సిరిసిల్ల, జూన్ - 22**

జనగణన -2027 లో భాగంగా మొదటి దశ ప్రక్రియ విజయవంతంగా నిర్వహించి.. రాజన్న సిరిసిల్ల జిల్లా రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలవడంతో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ కు అధికారులు శుభాకాంక్షలు తెలియజేశారు. జనగణన-2027లో భాగంగా నిర్వహించిన తొలి దశ గృహ జాబితా, గృహాల లెక్కింపు కార్యక్రమం 2026 మే 11న ప్రారంభమై జూన్ 9వ తేదీన ముగియగా, రాష్ట్రస్థాయిలో కచ్చితత్వ వివరాల నమోదు, ప్రక్రియ సరిగా పూర్తి చేయడం సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం డిస్ట్రిక్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ రాజన్న సిరిసిల్ల (డోర్స్) తరఫున జిల్లా అధికారులు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి.. శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా కలెక్టర్ ను కలిసిన వారిలో డోర్స్ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి అఫ్జల్ బేగం, సీపీఓ శ్రీనివాసాచారి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నీటి వాటాపై రాజీపడే ప్రసక్తే లేదు: ఆర్డీఎస్, తుంగభద్ర జలాలపై ఉత్తమ్ కుమార్ రెడ్డి

**నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో ఉత్తమ్ సమీక్ష**

**తెలంగాణ రైతుల ప్రయోజనాలను కాపాడుకునేందుకు అన్ని చర్యలు తీసుకుంటామన్న ఉత్తమ్**

**జలవివాదాలపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని ఆదేశాలు**

**హైదరాబాద్, నేటి ప్రభాత దర్శిని**

తెలంగాణ నీటి హక్కుల పరిరక్షణే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం అంతర్రాష్ట్ర జల వివాదాలపై ఫోకస్ పెట్టింది. సచివాలయంలో నీటిపారుదల శాఖ ఉన్నతస్థాయి అధికారులతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈరోజు అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ (ఆర్డీఎస్), తుంగభద్ర డ్యామ్ పరిధిలో తెలంగాణకు రావాల్సిన కృష్ణా నదీ జలాల వాటాపై ఈ మీటింగ్‌లో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఆర్డీఎస్ కింద తెలంగాణకు చట్టబద్ధంగా కేటాయించిన నీటి వాటా విషయంలో ఎవరితోనూ రాజీపడే ప్రసక్తే లేదని ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఆర్డీఎస్ ఆయకట్టు పరిధిలోని తెలంగాణ రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని తెలిపారు. తుంగభద్ర జలాల వినియోగంలో ఎగువ రాష్ట్రాలు (కర్ణాటక, ఏపీ) తీసుకునే ఏకపక్ష నిర్ణయాల వల్ల తెలంగాణ రైతులకు నష్టం జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. ట్రైబ్యునళ్లు, కృష్ణా నదీ యాజమాన్య బోర్డు, అంతర్రాష్ట్ర సమావేశాల వేదికగా తెలంగాణ హక్కులను చాలా బలంగా వినిపించాలని స్పష్టం చేశారు. కృష్ణా పరీవాహక ప్రాంత రైతుల సాగునీటి అవసరాలకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశిస్తూ.. రాష్ట్ర ప్రయోజనాలకు భంగం కలిగించే ఏ నిర్ణయాన్నైనా తీవ్రంగా వ్యతిరేకిస్తామన్నారు. ఈ అంతర్రాష్ట్ర జల వివాదాలపై చట్టపరమైన, సాంకేతిక, పరిపాలనా అంశాలతో కూడిన ఒక సమగ్ర నివేదికను వెంటనే సిద్ధం చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.

# సర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

**బూత్ లెవెల్ ఏజెంట్లు పూర్తి అవగాహన కలిగి ఉండాలి**

**మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ**




**నేటి ప్రభాతదర్శిని తిమ్మాపూర్ జూన్ 22 :**

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియపై బూత్ లెవెల్ ఏజెంట్లు పూర్తి అవగాహన కలిగి ఉండాలని మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. ఎస్ఐఆర్ ఉద్దేశ్యం, ప్రాముఖ్యతను ప్రజలకు వివరించి, ఈ విధానంపై ఉన్న అపోహలను తొలగించాలని ఆయన సూచించారు. తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి గ్రామంలోని సాయిరాం గార్డెన్‌లో సోమవారం ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లకు నిర్వహించిన అవగాహన శిబిరానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అర్హులైన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు అయ్యేలా బూత్ లెవెల్ ఏజెంట్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఓటర్ల జాబితాలో ఉన్న తప్పులను గుర్తించి సవరణలు చేపట్టాలని, అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగింపునకు గురికాకుండా చూడాలని సూచించారు. ప్రజాస్వామ్యానికి ఓటు హక్కు మూలస్తంభమని, ప్రతి ఓటు దేశ భవిష్యత్తును నిర్ణయించే శక్తిని కలిగి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ఖచ్చితమైన ఓటర్ల జాబితా ఎంతో అవసరమన్నారు. ఓటర్ల జాబితాలో పేర్లు నమోదు చేసుకోవడం ఎంత ముఖ్యమో, అర్హులైన వారి పేర్లు తొలగింపునకు గురికాకుండా చూడడం కూడా అంతే ముఖ్యమన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం చేపడుతున్న ప్రత్యేక సవరణ ప్రక్రియపై అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఓటర్ల జాబితాలో పేర్లు లేకపోవడం, వివరాల్లో తప్పులు ఉండటం లేదా చిరునామా మార్పులు వంటి అంశాలను వెంటనే సరిచేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియను బీఎల్‌వోలు పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన పేర్కొన్నారు. ఓటర్ల జాబితాలో పేర్ల నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులకు సంబంధించిన ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు కర్ర శ్రీనివాస్ రెడ్డి (తిమ్మాపూర్), ఇప్ప నరేందర్ (గన్నేరువరం), సురేష్ (ఇల్లంతకుంట), శ్రీకాంత్ (బెజ్జంకి), విజయ్ కుమార్ (మానకొండూరు), కొత్తపల్లి గ్రామ సర్పంచ్ గోదారి శోభారాణి, పలువురు ఆర్ఐలు పాల్గొన్నారు.

# శ్రమదాన కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి





**కమ్మర్పల్లి మండలం అమీర్ నగర్ గ్రామంలో నిర్వహించిన శ్రమదాన కార్యక్రమం.**

**నేటి ప్రభాత దర్శిని ప్రతినిధి నిజామాబాద్ జూన్ 23:**

సోమవారం రోజు నిజామాబాద్ జిల్లా కమ్మర్పల్లి మండలం అమీర్ నగర్ గ్రామంలో నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రమదాన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కోపరేటివ్ యూనియన్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి పాల్గొన్నారు, శనివారం రోజు కమ్మర్పల్లి మండలం అమీర్ నగర్ గ్రామానికి విచ్చేసిన మానాల మోహన్ రెడ్డికి అదే గ్రామంలో ఉన్న మహిళలందరూ మహిళా సంఘ భవనం గురించి వివరించడం జరిగింది ఈ సందర్భంగా మహిళా సంఘ భవన ప్రాంగణంలో కూర్చోవడానికి ఇబ్బంది ఉందని మానాల మోహన్ రెడ్డికి మహిళలందరూ విజ్ఞప్తి చేయడం జరిగిందని, ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి పని పై ప్రభుత్వం పై ఆధారపడకుండా, ప్రజలు తాము శ్రమదానంతో చేయగలిగిన పనిని ప్రజలందరూ ఒక్కటై శ్రమదానం చేస్తే అనేక చిన్న చిన్న సమస్యలు పరిష్కారము అవుతాయని మానాల మోహన్ రెడ్డి ఈ సందర్భంగా, పేర్కొన్నారు. కాగా ఆ వెంటనే రాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి కమ్మర్పల్లి మండలం అమీర్ నగర్ గ్రామస్తులతో మాట్లాడుతూ తాను కూడా మీతో కలిసి శ్రమదాన కార్యక్రమాన్ని నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నానని, అదేవిధంగా మనమందరము కలిసి శ్రమదానం తో మహిళా సంఘ భవనాన్ని మంచి స్థలంగా తీర్చిదిద్ది మహిళలకు కూర్చోవడానికి ఇబ్బంది లేకుండా చేయడానికి తాను అమీర్ నగర్ గ్రామ మహిళలు యువకులతో కలిసి సోమవారం రోజు కమ్మర్పల్లి మండలం అమీర్ నగర్ గ్రామంలో శ్రమదానం కార్యక్రమం నిర్వహించడం జరిగిందని మానాల మోహన్ రెడ్డి మీడియాకు తెలిపారు. కాగా ఈ సందర్భంగా మోహన్ రెడ్డి మాట్లాడుతూ ఈ యొక్క అమీర్ నగర్ మహిళా సంఘ భవన పరిసర ప్రాంతంలో ఏర్పాటు చేసిన కాంపౌండ్ వాల్ అనేది చాలా లోతుగా ఉండడం ద్వారా అక్కడ వర్షాకాలంలో నీరు నిలుస్తుందని ఆ విధంగా నీరు నిలవడంతో ఆ యొక్క ప్రాంగణము మొత్తం చెరువుగా మారుతుందని దానితో పాటు ఆ యొక్క నీటి వల్ల గ్రామానికి చెందిన మహిళలు మహిళా భవనంలోకి వెళ్లడం రావడం ఇబ్బందిగా మారిందని ఈ విధంగా నీరు నిలవడం వల్ల ఆ యొక్క పరిసర ప్రాంతాలలో పాములు తేళ్లు వంటి విషప్రాణులు అక్కడ రావడంతో ఈ యొక్క సంఘ భవనము ఉపయోగించడానికి మహిళలకు చాలా కష్టంగా ఉంటుందని సంబంధిత గ్రామానికి చెందిన మహిళలు తనకు ఈ విషయము తెలియజేయడంతో తాను సోమవారం రోజు కమ్మర్పల్లి మండలం అమీర్ నగర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో తాను తన సొంత ఖర్చులతో కాంగ్రెస్ పార్టీ నాయకులకు సంబంధించిన ట్రాక్టర్లను ఉపయోగించి శ్రమదానం చేసి అమీర్ నగర్ గ్రామం యొక్క మహిళా సంఘ భవనం కాంపౌండ్ వాల్ వద్ద ఉన్న భూమిని గ్రౌండ్ లెవెల్ చేయడం తో పాటు మహిళా సంఘ భవనానికి రంగులు వేయించి అందులో మహిళలు సమావేశమై కూర్చోవడానికి ఇబ్బంది లేకుండా చేయడము జరిగిందని మానాల మోహన్ రెడ్డి మీడియాకు తెలిపారు, అదేవిధంగా తాను ఇక ముందు కూడా ఈ యొక్క అమీర్ నగర్ మహిళా సంఘ భవనానికి ఎలాంటి సమస్యలు వచ్చినా తాను ముందు ఉండి ఆ యొక్క సమస్యలను తీర్చడానికి తన వంతు ప్రయత్నం చేస్తానని మోహన్ రెడ్డి పేర్కొన్నారు, ఈ సందర్భంగా మానాల మోహన్ రెడ్డి గ్రామస్తులతో మాట్లాడుతూ కేవలం శ్రమదానం ద్వారా పరిష్కారం అయ్యే చిన్న చిన్న పనుల పై గ్రామస్తులు ప్రభుత్వంపై ఆధారపడకుండా తమ పనులు తాము చేసుకోవాలని, ఇందుకు నిదర్శనంగానే తాను గ్రామస్తులతో కలిసి శ్రమదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్టు మోహన్ రెడ్డి మీడియాకు తెలిపారు. ఈ సందర్భంగా కమ్మర్పల్లి మండలం అమీర్ నగర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో జరిగిన శ్రమదానం కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కోపరేటివ్ యూనియన్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి తో పాటు, కమ్మర్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భువనగిరి భాస్కర్, కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు సుంకేటి రవి మండల కిసాన్ కేత్ అధ్యక్షులు అడిగే ప్రవీణ్ మరియు కమ్మర్పల్లి మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీనివాస్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు తిప్పిరెడ్డి శ్రీనివాస్, అమీర్ నగర్ సర్పంచ్ నీలవేణి దశరథ్, కుక్కునూరు సర్పంచ్ భూమారెడ్డి ఇనాయత్ నగర్ సర్పంచ్ బాణావత్ రాములు ఉప సర్పంచ్ అనిల్, కుంట ఆనంద్ మరియు కమ్మర్పల్లి మండల గ్రామ శాఖ అధ్యక్షులు కందరి భూమారెడ్డి క్యాతం గంగారెడ్డి పుప్పాల నరసయ్య, కానూరు లింబాద్రి రాజుల రమేష్ శ్రవణ్ రాజేశ్వర్ మానాల శ్రీనివాస్ క్యాతం గంగారం రాజుల భీమ్రాజ్ పుప్పాల లక్ష్మీనరసయ్య లతోపాటు అమీర్ నగర్ గ్రామానికి చెందిన మహిళలు యువకులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

